PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

బుధవారం WEDNESDAY 01.10.2025 | కరీంనగర్ KARIMNAGAR | పేజీలు : 4 pages : 4 | సంపుటి :1 || సంచిక :31 || ధర : 4.00 | నవమి

బుధవారం, సూర్యోదయం: 5-45, సూర్యాస్తమయం: 6-44. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: నవమి రాత్రి 12-36 వరకు. నక్షత్రం: విశాఖ ఉదయం 9-09 వరకు, తదుపరి అనురాధ, వర్జ్యం: పగలు 1-34 నుంచి పగలు 3-20 వరకు, రాహుకాలం: పగలు 3-25 నుంచి సాయంత్రం 5-02 వరకు.దుర్ముహూర్తం: ఉదయం 8-20 నుంచి ఉదయం 9-12 వరకు, పునర్ దుర్ము హూర్తం: రాత్రి 11-05 నుంచి రాత్రి 11-50 వరకు.అమృతకాలం: రాత్రి 12-14 నుంచి రాత్రి 2-01 వరకు.

CIRCULATED AT: WARANGAL, HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA ADILABAD, NIZAMABAD, RANGAREDDY, MAHABUBNAGAR, MEDAK

WWW.MEKARTHI DINAPATRIKA.COM

# ఫోన్ ట్యాపింగ్‌పై చర్యలు

## వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు

మేకార్తి దినపత్రిక, హైదరాబాద్, సెప్టెంబరు:
ఫోన్ ట్యాపింగ్ ) కేసుపై రివ్యూ చేస్తామని.. అనంతరం చర్యలపై ఆలోచిస్తామని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. ప్రజల సురక్షితం జీవనానికి పీపుల్ వెల్ఫేర్ పోలీస్ విధానాన్ని తీసుకు వస్తున్నామని పేర్కొన్నారు. సీపీగా కొత్త సంస్కరణలు తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని ఉద్ఘాటించారు. ఇవాళ(మంగళవారం) హైదరాబాద్ సీపీగా వీసీ సజ్జనార్ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం వీసీ సజ్జనార్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సీపీగా తాను చార్జ్ తీసుకున్నానని.. తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికీ ధన్యవాదాలు తెలిపారు వీసీ సజ్జనార్.

సెన్సేషనల్ కేసులు చేధించారు..

తనకున్న గత అనుభవంతో హైదరాబాద్ సీపీగా విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. టీం వర్క్‌కు మారుపేరు హైదరాబాద్ కమిషనరేట్ అని ప్రశంసించారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని పండుగలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జరిపామని తెలిపారు. హైదరాబాద్ పోలీసులు సెన్సేషనల్ కేసులు చేధించారని కొనియాడారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక సిటిజన్ ఒక పోలీస్ ఆఫీసర్ అని నొక్కిచెప్పారు. పౌరులు సామాజిక బాధ్యతతో ప్రవర్తించాలని ఆకాంక్షించారు. పీపుల్స్, ఫ్రెండ్లీ పోలీసుకు తెలంగాణ పోలీసులు మారుపేరని కీర్తించారు. పీపుల్ వెల్ఫేర్ పోలీసుగా తయారు చేస్తామని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య ఉందని చెప్పుకొచ్చారు. పీపుల్ వెల్ఫేర్ పోలీస్ కాన్సెప్ట్‌తో ముందుకు వెళ్తామని తెలిపారు. హైదరాబాద్ విశ్వ నగరం.. మనకు డ్రగ్స్ పెద్ద సమస్య అని వెల్లడించారు వీసీ సజ్జనార్.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం

'డ్రగ్స్‌పై, రౌడీ షీటర్లపై ఉక్కుపాదం మోపుతాం.. పీడీ యాక్టులు పెడతాం. అంతకు ముందు డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారి కేసులు పున: పరిశీలిస్తాం. నిందితులకు సంబంధించిన డేటా బేస్ తయారు చేస్తాం. ఈగల్ టీంని మరింత బలోపేతం చేస్తాం. తెలంగాణ ప్రభుత్వం కూడా డ్రగ్స్‌పై సీరియస్‌గా ఉంది. డ్రగ్స్‌ని అరికట్టడమే హైదరాబాద్ పోలీసులు టాప్ ప్రయారిటీ. రోజుకో కొత్త రకం సైబర్ కేసులు నమోదు అవుతున్నాయి. ప్రజలు సైబర్ నేరాలు, డిజిటల్



అరెస్ట్ లాంటి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
డబ్బు ఎవరికీ ఊరికే రాదు.. అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరగాలి. సే నో టు డ్రగ్స్ అంటూ నేను మొదలు పెట్టిన క్యాపెయిన్ విజయవంతం అయింది. బెట్టింగ్ యాప్‌లు బ్యాన్ అయ్యాయి.. జనాల్లో అవగాహన పెరిగింది. ఆన్‌లైన్ బెట్టింగ్, ప్రజలకు హాని కలిగించే యాప్‌లను ఎవరూ ప్రమోట్ చేయొద్దు. కల్తీ ఆహారం పెద్ద సమస్యగా మారింది. ఈ అంశాలపై సమగ్ర దృష్టి సారిస్తాం. ఆహారంలో కల్తీ చేసే గ్యాంగ్‌లపై ఉక్కుపాదం మోపుతాం. ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ జటిలం అవుతోంది. జీఎస్టీ తగ్గడంతో వాహనాల సంఖ్య పెరిగాయి. ట్రాఫిక్‌పై లాంగ్ టర్మ్ లక్ష్యం పెట్టుకుని పని చేస్తాం' అని వీసీ సజ్జనార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లపై దృష్టి సారిస్తాం..

'ట్రాఫిక్ నేపథ్యంలో ప్రజల సమయం సేవ్ చేయడానికి, ప్రజల ఆరోగ్యం కోసం పని చేస్తాం. ప్రమాదకరంగా మారిన డ్రంకెన్ డ్రైవ్ (%ఐతీబఅఎవఅ ఐతీఅజవం%)లపై దృష్టి సారిస్తాం. డ్రంకెన్ డ్రైవ్ చేసేవారు సూసైడ్ బాంబ్ లాంటి వారు. డ్రంకెన్ డ్రైవ్‌లపై తనిఖీలు ముమ్మరం చేస్తాం. ఏఐ గ్రీవెన్స్ విధానాన్ని తీసుకొస్తాం. డ్రోన్స్, ఏఐ టెక్నాలజీ వినియోగంపై స్టడీ చేస్తాం.. డ్రోన్స్ టెక్నాలజీ, ఏఐ సాంకేతికతతో పోలీసులకు శిక్షణ ఇస్తాం. ఆడపిల్లలు , చిన్న పిల్లలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు. ఆడపిల్లల జోలికి వచ్చే ముందు ఇంట్లో తల్లి, పిల్లలను గుర్తు తెచ్చుకోవాలి. డయల్ 100 నెంబర్‌ని ఇంప్రూవ్ చేసే అంశాలపై ఆలోచిస్తాం.. సీసీటీవీలు ఏర్పాటు చేస్తాం. సీసీటీవీల ఏర్పాటుతో బయటి నుంచి క్రిమినల్ గ్యాంగ్‌లు రావడం ఆగిపోయాయి. ప్రతి బిల్డింగ్‌లో సీసీటీవీలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతాం. హైదరాబాద్ పోలీసులు ఎక్కువగా కష్టపడుతారు. వారి సంక్షేమాన్ని టాప్ ప్రయారిటీగా తీసుకుంటాం. ఉత్తమ విధులు నిర్వర్తించిన పోలీసులను గుర్తిస్తాం.. రివార్డులు ఇస్తాం. ప్రజల వెంట హైదరాబాద్ పోలీసులు ఎల్లప్పుడూ ఉంటారు. ప్రజలకు నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటాను.. సోషల్ మీడియాలో ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం, కించపరచటం మంచిది కాదు తప్పకుండా చర్యలు ఉంటాయి. సివిల్ మ్యాటర్‌తో ఇల్లీగల్ యాక్టివిటీస్‌లో పాలు పంచుకునే పోలీసులపై తప్పక చర్యలు ఉంటాయి. శాంతి, మత సామరస్యానికి హైదరాబాద్ పెట్టింది పేరు. గంగ జమున సంగమం అనే కాన్సెప్ట్‌తో ముందుకెళ్తాం' అని వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.


## మద్యం,మాంసం ప్రియులకు షాకింగ్ న్యూస్



మేకార్తి దినపత్రిక, హైదరాబాద్, సెప్టెంబరు:
మద్యం, మాంసం ప్రియులకు షాకింగ్ న్యూస్. అక్టోబర్ 2వ తేదీన మాంసం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మాంసం దుకాణాలు, స్లాటర్ హౌస్‌లను జీహెచ్ఎంసీ పరిధిలో మూసివే యాలని కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్ ఓ ప్రకటన విడుదల చేశారు. మహాత్మా గాంధీ జయంతికి మాంసం దుకాణాలు బంద్ చేయాలని జీహెచ్ఎంసీ యాక్ట్ 1955లోని 533 ప్రకారం స్టాండింగ్ కమిటీలో ఆమోదించారని గుర్తుచేశారు. సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షణ చేపట్టి సరైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈసారి గాంధీ జయంతి రోజునే దసరా రావడంతో అయోమయంలో పడ్డారు మాంసం విక్రయ దారులు. మద్యం షాపులు బంద్ మరోవైపు అక్టోబర్ 2వ తేదీ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా కూడా మాంసం షాపులతో పాటు మద్యం షాపులను కూడా మూసివేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏడాది మహాత్మా గాంధీ జయంతికి తెలంగాణ వ్యాప్తంగా ఈ రూల్‌ను పాటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది మహాత్మా గాంధీ జయంతి, దసరా పండుగలు ఓకే రోజు వచ్చాయి. ఈ క్రమంలో మద్యం షాపులను ప్రభుత్వం మూసివేస్తూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో దసరాను ఘనంగా చేసుకుంటారు. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై ఏం చేయాలా అనే ఆలోచనలో మద్యం, మాంసం ప్రియులు ఉన్నారు

## టాబ్లెట్‌లు వేసుకోలేదని తల్లిని రాడ్డుతో కొట్టి

మేకార్తి దినపత్రిక, హైదరాబాద్, సెప్టెంబరు:
ప్రస్తుత సమాజంలో మానవతా విలువలకు మనుషులు దూరమవుతున్నారు. మన, తన అనే తేడాలు లేకుండా దారుణాలకు ఒడిగడుతున్నారు. దేని కోసం ఎందు కోసం చేస్తున్నారో తెలియకుండానే.. కన్న వారిని, కట్టుకున్న వారిని కడతేర్చుతున్నారు. తాజాగా.. ఇలాంటి ఘటనే ఒకటి నగరంలో చోటుచేసుకుంది. ఎస్సార్ నగర్‌లో ఓ కసాయి కూతురు కన్నతల్లిని కడతేర్చింది. ఇనుప రాడ్డుతో తల్లిపై అతి కిరాతకంగా దాడి చేసి హతమార్చింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. ఎస్సార్ నగర్‌లో ఓ కూతురు తన తల్లి టాబ్లెట్‌లు వేసుకోలేదని ఇనుపరాడ్డుతో కొట్టి చంపింది. మృతి చెందిన తల్లి వయసు 90 ఏళ్లు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని



పరిశీలించినట్లు తెలిపారు. హత్య చేసిన నిందితురాలు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వివరించారు. ఈ మేరకు కూతుర్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఆదిత్య వింటేజ్ నిర్మాణాలపై ఎంపీ రఘునందన్ ఫైర్



మేకార్తి దినపత్రిక,హైదరాబాద్, సెప్టెంబర్ 30:
నర్సింగ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా సర్వీస్ రోడ్డును మింగి ఆదిత్య వింటేజ్ భారీ భవనం నిర్మిస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు ఫైర్ అయ్యారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... అడ్డగోలుగా ఆదిత్య వింటేజ్ నిర్మాణాలు చేపడుతున్నారని.. సర్వీస్ రోడ్డు లేకుండా నిర్మాణం చేస్తుంటే ఎలా అనుమతి వచ్చిందని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం జరుగుతోందన్నారు. ఎవరి ప్రమేయంతో ఈ నిర్మాణాలు చేస్తున్నారని నిలదీశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. అలాగే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కాపీ పంపుతానని ఎంపీ చెప్పారు.

"పేదోడి ఇండ్లను అడ్డగోలుగా కూలగొడుతున్నారని...పెద్దలకు ఎలా అనుమతులు ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కి చిత్త శుద్ధి ఉంటే ఈ నిర్మాణాన్ని ఆపాలన్నారు. నిర్మాణం ఆపకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. హెచ్ఎమ్‌డీఏ అధికారులే కేసులు వేస్తారని.. మళ్లీ వారే అనుమతి ఇస్తారని విమర్శించారు. ఈ నిర్మాణ అనుమతులలో సీఎం రేవంత్ రెడ్డి ఇన్వాల్వ్ అయ్యారా. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇన్వాల్వ్ అయ్యారా అని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, హద్దులు తొలగించారని క్రిమినల్ కేసులు నమోదు చేశారని.. ఈ నిర్మాణంలో సూట్ కేసులు అందుకుంటున్న మంత్రులు ఎవరో సీఎం రేవంత్ రెడ్డి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నీతి వాఖ్యలు చెబుతుంటారు.. అందుకే ఆయనకు చెబుతున్నాను.. మంత్రుల మీద చర్యలు తీసుకోమని ఏఐసీసీకి లేఖ రాయండి' అంటూ హితవుపలికారు. వంద శాతం అవినీతి జరిగిందని.. అక్రమ నిర్మాణం జరిగిందని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం

మేకార్తి దినపత్రిక,హైదరాబాద్, సెప్టెంబర్ 30:
హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు బాగా ఎండ కాసింది. 2.40 నిమిషాల సమయంలో ఉన్నట్టుండి భారీ వర్షం మొదలైంది. అరగంట పాటు వర్షం దంచికొట్టింది. ఉన్నట్టుండి వర్షం పడ్డంతో జనాలు తీవ్ర ఇబ్బందుపడాల్సి వచ్చింది. మరో నాలుగు రోజులు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

రేపు బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. అల్పపీడన ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడతాయని వెల్లడించింది. ఏపీలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. ఇక, అల్లూరి,



పార్వతీపురం, కాకినాడ, యానాం, ఉభయ గోదావరి జిల్లాలతోపాటు నెల్లూరు, తిరుపతి జిల్లాలలో రానున్న 24 గంటల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నివారణ సంస్థ అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్లకు కీలక సూచనలు చేసింది

# డీజీపీ జితేందర్ కంటతడి

మేకార్తి దినపత్రిక హైదరాబాద్, సెప్టెంబర్ 30:
తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్ ఈరోజు పదవి విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీలో డీజీపీకి పోలీస్ శాఖ పరేడ్, వీడ్కోల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కుటుంబం గురించి మాట్లాడుతూ కంటతడి పెట్టారు. 'ఇటీవలే నా తల్లి చనిపోయారు.. నన్ను అర్థం చేసుకుని నాకు సహకరించిన నా భార్య, పిల్లలకు కృతజ్ఞతలు. తల్లి, తండ్రి ఇద్దరినీ కోల్పోయాను.. ఉద్యోగ రీత్యా ఫ్యామిలీ, బంధువులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. అర్థం చేసుకున్నారు అని అనుకుంటా' అంటూ తల్లిని గుర్తు తెచ్చుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు జితేందర్.

ఇది మర్చిపోలేని అనుభవం..

ఇక మిగితా విషయాలపై ఆయన మాట్లాడుతూ.. గత 33 సంవత్సరాలుగా ఏపీ, తెలంగాణలో పోలీస్ శాఖలో కీలక పదవుల్లో పని చేశానని చెప్పారు. పంజాబ్‌లో పుట్టి పెరిగానని.. పోలీస్ శాఖలో ఉండి ప్రజలకు సేవ చేయడం మర్చిపోలేని అనుభవం అని అన్నారు. తన 40 ఏళ్ల జీవితం 40 రోజులా గడిచిపోయిందని తెలిపారు. డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో గత 15 నెలల్లో లా అండ్ ఆర్డర్, సైబర్ క్రైమ్, నేరాలు అదుపులో ఉన్నాయని.. నక్సలిజం, టెర్రరిజం వంటి సంఘాలు నుంచి ప్రజలకు రక్షణ కల్పించామని అన్నారు.

అన్నింటినీ ఎదుర్కున్నాం...

వరదలను సమర్థంగా ఎదుర్కున్నామని డీజీపీ తెలిపారు. గణేష్ నిమజ్జనం, శ్రీరామ నవమి, బక్రీద్ వంటి పండగల్లో చిన్న తప్పిదం లేకుండా నిర్వహించామన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ కేవలం తెలంగాణ ప్రజల కోసమే కాకుండా ఇతర రాష్ట్రాల కోసం కూడా పని చేసిందని వెల్లడించారు. అందుకు సాక్ష్యం బెట్టింగ్ యాప్స్



నిర్వాహకులను అరెస్ట్ చేయడం, సైబర్ నేరగాళ్లనీ అరెస్ట్ చేశాం, ఆర్థిక నేరాలు చేసే వారిని అరెస్ట్ చేశామన్నారు.

తెలంగాణ పోలీస్ శాఖ నెంబర్ వన్..

నాకు తెలంగాణ పోలీస్ మీద నమ్మకం ఉంది శాంతి భద్రతలు కాపాడటంలో ఎప్పుడు ముందుంటారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖ నెంబర్ వన్ స్థానంలో ఉంది. నేరాల నియంత్రణకు టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుంది. డ్రగ్స్, సైబర్ క్రైమ్ ప్రస్తుత రోజుల్లో సవాలుగా మారాయి. టెక్నాలజీ ఉపయోగించుకుని కేసులు చేధించడంలో తెలంగాణ పోలీసులు ముందున్నారు. కాబోయే నూతన డీజీపీ శివధర్ రెడ్డి డీజీపీ పదవికి అర్హుడు. శివధర్ రెడ్డికి నాకు మంచి స్నేహబంధం ఉంది. ఎన్నో ఏళ్ళు పోలీస్ శాఖలో వివిధ విభాగాల్లో పని చేసిన అనుభవం ఉంది. శివధర్ రెడ్డి సేవలు తెలంగాణ ప్రజలకి ఎంత గానో ఉపయోగప డతాయి' అని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు.

%జితేందర్ ఐడియాలజీ ఆదర్శం: శివధర్ రెడ్డి

తెలంగాణ నూతన డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. గత 14 నెలల నుంచి తెలంగాణ పోలీస్ శాఖకు తన సేవలు అందించిన జితేందర్‌కు అభినందనలు తెలియజేశారు. ఇద్దరం కలిసి గుంటూరు జిల్లాలో కలిసి పనిచేశామని గుర్తుచేశారు. జితేందర్ ఐడియాలజీ తనకు ఆదర్శనీయమన్నారు. జితేందర్ పాలనా దక్షత తమకు మార్గదర్శకం అవ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు. డీజీపీగా ఉంటూ కీలక సేవలు అందించారని శివధర్ రెడ్డి వెల్లడించారు. ఇక రేపు (బుధవారం) తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించినున్నారు.

# 8వ తేదీపైనే అందరి ఫోకస్!

## బీసీలకు 42% రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ
## న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా?

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ విషయంలో దాఖలైన పిటిషన్ పై వచ్చేనెల 8న హైకోర్టు విచారించనున్నది. ఈ క్రమంలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నదనే ఉత్కంఠ అందరిలో నెలకొన్నది. పెంచిన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా? లేక అభ్యంతరం చెపుతుందా? అనేది ఆసక్తికరంగా మారింది. న్యాయస్థానం తీర్పు ఎలా ఉంటుందోనని అన్ని రాజకీయ పార్టీలు ఎదురుచూస్తున్నాయి. ఒకవేళ బీసీ రిజర్వేషన్ల పెంపు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని హైకోర్టు అభిప్రాయపడితే.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి లోబడి ఖరారు చేసేందుకు ప్రభుత్వం కొత్తగా జీవో ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే ప్రస్తుతం ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ను రద్దు చేసి, కొత్తగా షెడ్యూల్ ప్రకటించక తప్పదనే అధికార వర్గాల్లో జరుగు తున్నది.

కోర్టు ఒప్పుకోవడం కష్టమే!

బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఈనెల 27న దాఖలైన హౌజ్ మోషన్ పై హైకోర్టు విచారణ జరిపింది. ఆ సందర్భంగా కలిసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు.'రిజర్వేషన్ల పెంపు ఏ ప్రాతిపదికన ఇస్తారు? బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉండగా జీవో ఎలా ఇస్తారు?' అని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. తదుపరి విచారణను వచ్చేనెల 8కి వాయిదా వేసింది.

కానీ స్టేట్ ఎలక్షన్ కమిషన్.. ప్రభుత్వం ఇచ్చిన జీవో ఆధారంగా అక్టోబరు 9 నుంచి ఎన్నికలను నిర్వహించేందుకు షెడ్యూలు ప్రకటించింది. 8న జరిగే విచారణలో బీసీలకు 42% రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు తప్పకుండా అభ్యంతరం తెలుపుతుందనే చర్చ న్యాయ వర్గాల్లో జరుగుతున్నది. మొత్తం రిజర్వే షన్లు 50% లోపు ఉండాలని గుర్తుచేస్తున్నారు. విచారణలో ఆ జీవోను హైకోర్టు కొట్టివేసే చాన్స్ ఉందని వాదిస్తున్నారు.

ప్లాన్ బీతో సర్కారు రెడీ

పెంచిన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు అభ్యంతరం చెబితే వెంటనే ప్లాన్ బీని అమలు చేసేందుకు సర్కారు రెడీగా ఉంది. మొత్తం రిజర్వేషన్లు 50% లోపు కేటాయించి ఎన్నికలకు వెళ్లేందుకు కసరత్తు పూర్తి చేసింది. అందుకు కొంత సమయం తీసుకోవాలని భావి స్తున్నది. ఎందుకంటే కోర్టు తీర్పు ప్రకారం బీసీ రిజర్వేషన్లను కుదించేందుకు మళ్లీ కొత్తగా జీవో జారీ చేయాలి. ఆ జీవో ఆధారంగా స్థానిక సం స్థల రిజర్వేషన్లను ఖరారు చేయాలి. అందుకోసం కనీసం పక్షం రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ ప్రక్రి య పూర్తయిన తర్వాత ఎన్నికల సంఘం కొత్తగా షెడ్యూలు విడుదల చేయాల్సి ఉ ంటుంది. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 23%, ఎస్సీలకు 18%, ఎస్టీలకు 9% రిజర్వేషన్లు కల్పించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అంతే స్థాయిలో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తుందా? లేక ఇతర వర్గాలకు తగ్గించి, బీసీలకు ఏమైనా పెంచుతుందా? అనే చర్చ జరుగుతున్నది.

# శ్రీ దుర్గా శరన్నవరాత్రి మాత ఉత్సవాల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు




మేకార్తి దినపత్రిక సెప్టెంబర్

ఈరోజు ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ ప్రధాన వీధుల మీదుగా నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించడం జరిగింది గ్రామ సుభిక్షంగా ఉండాలని పాడిపంటలతో అభివృద్ధి చెందాలని అమ్మవారి కృప కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని సర్వేజనా సుఖినోభవంతు అంటూ భవాని నామ సంకీర్తనలతో గ్రామం మొత్తం తిరగడం జరిగింది ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు అన్నమేని బుదయ ఉపాధ్యక్షులు తోట ధర్మేందర్ భజన మండలి భక్తులు పాక అంజయ్య సిరిపురం విట్టల్ పెంటం సత్యనారాయణ మరియు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పనివాళ్లతో జర భద్రం సుమా




**ప్రాణాలు తీసేందుకూ వెనుకాడని వైనం**
**ఇబ్బడిముబ్బడిగా వెలసిన కేర్‌టేకర్ ఏజెన్సీలు**
**పని మనుషుల ఎంపికలో యజమానులు**
**అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు**
**ఆధార్, బయోమెట్రిక్ తప్పనిసరిగా తీసుకోవాలి**
**నేరచరిత్ర తెలుసుకున్న తర్వాతే**
**పనిలో పెట్టుకోవాలి: డీసీపీ సురేష్**

హైదరాబాద్ సిటీ: ప్రస్తుతం హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా గుర్తింపు పొందింది. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి లక్షలాది మంది బతుకుదెరువు కోసం ఇక్కడికి వస్తున్నారు. వారిలో కొంతమంది కార్మికులుగా, ఇళ్లలో పనివాళ్లుగా, డ్రైవర్లు, ప్లంబర్లు, పెయింటర్లుగా చేరుతున్నారు. నగరంలో ఇంటి పనివారికి, కేర్ టేకర్లకు, డ్రైవర్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. దాంతో యజమానులు ఎవరిని పడితే వారిని నమ్మి పనిలో పెట్టుకుంటున్నారు. మరికొందరైతే ప్రైవేట్ ఏజెన్సీలను ఆశ్రయించి, వారు ఎవరిని పంపిస్తే వారినే పనిలో పెట్టుకుంటున్నారు. ఇలా పెట్టుకున్న కొందరితో ఒక్కోసారి ముప్పు వాటిల్లుతోంది.

పదిరోజులకే యజమానురాలి హత్య

కూకట్‌పల్లిలో రేణు అగర్వాల్ దారుణ హత్యకు గురైన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. జార?ండ్‌కు చెందిన ఇద్దరు పనివాళ్లు పనిలో చేరిన పదిరోజులకే ఇంట్లో ఉన్న బంగారం, డబ్బుపై కన్నేసి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో యజమానురాలైన రేణు అగర్వాల్‌ను కాళ్లు చేతులు కట్టేశారు. ఇంట్లో బంగారం, నగదు ఎక్కడుందో చెప్పాలని చిత్రహింసలకు గురిచేశారు. ఆ తర్వాత కుక్కర్‌తో తలపై మోది, కత్తితో గొంతుకోసి దారుణంగా హత్య చేసి ఇంటి నుంచి పరారయ్యారు. ఈ దారుణ హత్య వెలుగులోకి రావడంతో స్థానికులు, పోలీసులు ఉలిక్కిపడ్డారు.

ఇటీవల జరిగిన ఘటనలు..

ఫ దోమలగూడ పరిధిలో ఓ ఇంట్లో పనికి చేరిన నేపాల్ దొంగలు.. నెలరోజుల్లోనే దొంగతనానికి పాల్పడ్డారు. వృద్ధులకు భోజనంలో మత్తుమందు కలిపి ఇచ్చి, రూ. కోటిన్నర విలువైన బంగారం, డబ్బు దోచుకొని ఉడాయించారు. ఇప్పటికీ వాళ్లు దొరకలేదు.

బతుకుదెరువుకోసం నగరానికి వచ్చిన వ్యక్తి ఓ బంగారం దుకాణంలో పనిలో చేరాడు. చేరిన నాలుగు రోజులకే యజమానికి టోకరా వేసి రూ. 30లక్షలతో చెక్కేశాడు.

పనిలో చేరిన మరుసటి రోజే 150 తులాల బంగారం, వజ్రాభరణాలతో ఉడాయించిన ఘటన గతంలో ఎస్ఆర్‌నగర్‌లో జరిగింది. ఇంటి యజమానులు పనిమీద బయటకు వెళ్లగానే పనిమనిషి ఇంట్లో ఉన్న వృద్ధుల కళ్లలో కారం చల్లి బంగారు నగలతో పరారయ్యారు.

యజమాని దుకాణంలో రూ. 9లక్షలు దోపిడీ చేసిన ఘటన ఈస్ట్ జోన్ పరిధిలో ఇటీవల వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి సుల్తాన్‌బజార్ పరిధిలో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అందులో పనికి కుదిరిన రాజస్థాన్‌కు చెందిన వర్కర్ యజమాని వద్ద నమ్మకంగా పనిచేశాడు. యజమాని అతడితో మరో దుకాణం పెట్టించాడు. యజమానికి నష్టం చేకూర్చాలని దుర్బుద్ధి పుట్టిన వర్కర్ పథకం ప్రకారం తన రాష్ట్రం నుంచి స్నేహితుల ముఠాను పిలిపించి పదునైన ఆయుధాలతో షట్టర్ తెరిచి రూ. 9 లక్షలు దోచుకెళ్లారు.

యజమానిని నమ్మించిన క్యాబ్ డ్రైవర్.. తన స్నేహితులతో కలిసి రూ. 40 లక్షలు దోపిడీ చేసిన ఉదంతం 15 రోజుల క్రితం వెలుగులోకి వచ్చింది.

యజమానులు తెలుసుకోవాల్సిన అంశాలు

ఏజెన్సీల ద్వారా కాకుండా తెలిసిన వ్యక్తుల ద్వారా పనివాళ్లను ఎంపిక చేసుకోవాలి. వారి చిరునామా, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ లాంటి గుర్తింపు కార్డులను పరిశీలించాలి. ఒక కాపీ మన వద్ద పెట్టుకోవాలి.

అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలి. వారు విచారణ చేసి రిపోర్టు ఇస్తారు. గతంలో నేర చరిత్ర ఉంటే తెలుస్తుంది.

ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువుకోసం వచ్చిన వారిని నమ్మలేం.

డ్రైవర్ల ముందు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విషయాలు మాట్లాడకపోవడం మంచిది.

బ్యాంకు పనులు, ఇంటికి సంబంధించిన ముఖ్యమైన పనులు అప్పగించకపోవడమే మంచిది.

పనివాళ్ల కుటుంబసభ్యుల ఫోన్ నంబర్‌తో పాటు.. పనివాళ్ల బయోమెట్రిక్ తీసుకోవడం మంచిది.

సురేష్ కుమార్, డీసీపీ, బాలానగర్

మంచితనం నటించి..

కొందరు కేటుగాళ్లు దోచుకోవడమే లక్ష్యంగా ఇంట్లో పనివాళ్లుగా, కేర్‌టేకర్లుగా, డ్రైవర్లుగా చేరుతున్నారు. కొంతకాలం యజమానులు చెప్పినట్లు నడుచుకొని, అతి మంచితనాన్ని ప్రదర్శిస్తున్నారు. సొంతవాళ్లనే విధంగా యజమానుల మెప్పు పొందుతున్నారు. డబ్బు, బంగారం, ఇతర విలువైన వస్తువులు ఉన్న గదుల్లోకి వెళ్లేంత చనువు పొందుతున్నారు. అదును చూసి ఇంట్లో ఉన్న వృద్ధులను కట్టేసి, మత్తుమందు కలిపిన భోజనం పెట్టి, లేదంటే దారుణంగా హత్య చేసో సొత్తుతో దోచుకుని ఉడాయిస్తున్నారు


# పైరసీపై నిఘా తప్పనిసరి

మేకార్తి దినపత్రిక సెప్టెంబర్

ఫిలిం ఛాంబర్‌కు యాంటీ పైరసీ సెల్ ఎప్పటి నుంచో ఉందని.. కానీ అవన్నీ ఫిజికల్ పైరసీని అడ్డుకోవటానికి మాత్రమే అని ఫిలిం ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ.. కానీ ఈ మధ్యకాలంలో హెచ్.డి ప్రింట్స్ వస్తున్నాయన్నారు. గేమ్ ఛేంజర్ , సింగిల్ , హిట్ 3 ఇలా వరుసగా సినిమాల క్వాలిటీ ప్రింట్స్ వచ్చాయని అన్నారు. జూన్‌లో తాము ఈ పైరసీ వ్యవహారంపై ప్రభుత్వాన్ని, పోలీసులను అప్రోచ్ అయ్యామని చెప్పారు. సీపీ ఆనంద్ తమ కేసును ప్రత్యేకంగా తీసుకుని టీంస్‌ను ఏర్పాటు చేసి పైరసీ రాకెట్‌ను చేధించారని అన్నారు.

చాదీచీ% ఛానల్ ఫాలో అవ్వండి

పైరసీ దారులు చాలా అడ్వాన్స్‌డ్‌గా హ్యాకింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. వారిని పట్టుకోవటానికి పోలీసులు తమ సిస్టమ్స్‌ను అప్డేట్స్ చేసుకోవాల్సి వచ్చిందన్నారు. అయితే ఇక ముందు కూడా పైరసీపై నిరంతరం నిఘా ఉండాల్సిందే అని అన్నారు. సినీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం లేబర్ కమీషనర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు జరిగిందని... రెండు నెలల సమయంలో అన్నీ ఓ కొలిక్కి వస్తాయని చెప్పారు. ట్రంప్ టారిఫ్ అనేది వారి దేశానికి సంబంధించిన పాలసీ అని.. దాని




ఎఫెక్ట్ ఒక్క తెలుగే కాదు అన్నీ సినిమాలపై ఉంటుందని చెప్పారు. టారిఫ్‌కు అనుగుణంగా బిజినెస్ మోడల్ మార్చుకోవాలని ఫిలింఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ వెల్లడించారు

# పట్టించుకోక పోవడంతో మూతపడ్డ మిల్లులు



గమనం,వాంకిడి (సెప్టెంబరు 30):

జిల్లాలో ఏర్పాటు చేసిన దాల్‌మిల్లులు అధికారులు పట్టించు కోక పోవడంతో మూతపడ్డాయి. జిల్లాలో గిరిజన మండలాల రైతులు పండిస్తున్న పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక దళారులకు విక్రయించి నష్టపో వల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ నేనపథ్యంలో కంది, జొన్న సాగుచేసుకునే గిరిజన రైతులను ఆదుకోవా లన్న ఉద్దేశంతో వన బంధు కల్యాణ యోజన పథకం కింద సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలో జిల్లాలోని వాంకిడి, తిర్యణి మండలాల్లో గత ప్రభుత్వం దాల్‌మిల్లు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణతో గిరిజన రైతు లకు గిట్టుబాటు ధర లభించగా మరోవైపు మహిళా ఉత్పత్తిదారు సంఘాలకు వాటా రుపేణా లాభాలు అందాయి. దాల్‌మిల్లులు కొన్నేళ్ల పాటు మంచి ఫలి తాలు ఇవ్వగా అనంతరం వీటి నిర్వహణను అధికా రులు పట్టించుకోకపోవడంతో మిల్లులు మూతపడ్డా యి. ఫలితంగా రైతు, మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి లేకుండా పోతుంది.

- ఐటీడీఏ పీవో చొరవతో..

గిరిజన మహిళా సంఘాలను బలోపేతం చేయా లనే సంకల్పంతో అప్పటి ఐటీడీఏ పీవో ఆర్వీ కర్ణన్ దాల్‌మిల్లుల ఏర్పాటుకు కృషి చేశారు. 2017లో వాంకిడి, తిర్యాణి మండల కేంద్రాల్లో రూ. 7.80 లక్షలతో మినీ దాల్‌మిల్లు కేంద్రాలను ఏర్పాటు చేశా రు. వాంకిడిలో దాల్‌మిల్లుతో పాటు అదనంగా జొన్నపిండి, రవ్వ, తయారు చేసేందుకు రూ. 4 లక్షలతో యంత్రాలను ఏర్పాటు చేశారు. కెరమెరి మండలంలో ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో కందులు కోనుగోలుచేపట్టారు. ఇక్కడ కొనుగోలు చేసిన కందులను వాంకిడి దాల్‌మిల్లులో పప్పు తయారు చేసి విక్రయించేవారు. తయారు చేసిన పప్పులను ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేసే వారు. ఇప్పటికీ ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేసిన పప్పుకు సంబంధించిన డబ్బులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

- అధికారుల పర్యవేక్షణ లేక

కొన్నాళ్లపాటు దాల్ మిల్లులు లాభాల బాటలో నడవగా మహిళా సంఘాలకు సైతం లాభాల వాటా అందేది. క్రమేణా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి కింది స్థాయి అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో అవి నష్టాల బారిన పడ్డాయి. దీంతో మూడేళ్ల నుంచి యంత్రాలు మూ లన పడి తుప్పుపట్టాయి. ఉన్నతాధికారులు సైతం చొరవ చూపక పోవడంతో ఆయా మండలా ల్లో కం దుల కొనుగోళ్లు సైతం నిలిచిపోయాయి. ఫలితంగా రూ. లక్షల విలువైన యంత్రాలు నిరుప యోగంగా మారాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి దాల్ మిల్లులను పునః ప్రారంభిస్తే ఉ పాధి లభిస్తుంద ని మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారు.

పునఃప్రారంభించే లా చర్యలు..


- కోనయ్య ఏపీఎం, ఇందిరాక్రాంతి పథకం

పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. వాంకిడి మండలానికి ఏపీఎంగా ఇటీవలే బదిలీపై వచ్చాను. దాల్ మిల్లులు పనిచేయడం లేదని తెలి సింది. దాల్ మిల్లును పరిశీలించాం. దాల్ మిల్లులు ప్రారంభంలో లాభాల బాటలో నడిచాయి. క్రమేణా నష్టాల బారిన పడ్డాయి. మూడేళ్ల నుంచి దాల్‌మి ల్లుల నిర్వహణ కొనసాగడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

# ఉపఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ కసరత్తు పూర్తి

గమనం,హైదరాబాద్:

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ కసరత్తు పూర్తి చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తుది ఓటర్ల జాబితా విడుదల చేసింది. జాబితాను సుదర్శన్ రెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో మొత్తం ఓటర్లు 3 లక్షల 99 వేలు ఉన్నట్లు తెలిపారు. జూలై 1న అర్హత తేదీగా తీసుకుని ఓటర్ల జాబితా సవరణ చేసినట్లు పేర్కొన్నారు. సవరణ అనంతరం జాబితాలో 2,07,382 మంది పురుషులు, 1,91,593 మంది మహిళలు, 25 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు, 6,106 మంది యువ ఓటర్లు (18-19 సంవత్సరాలు), 2,613 మంది వృద్ధులు (80 ఏళ్లు పైబడిన వారు), 1,891 మంది దివ్యాంగులు ఉన్నట్లు స్పష్టం చేశారు. కాగా, 139 కేంద్రాల్లో 409 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈసీ కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు పూర్తి చేసింది. జూబ్లీహిల్స్‌కు జరుగుతోంది ఉపఎన్నిక అయినా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు



ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఈ ఎన్నికపై ఆసక్తి నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఆశించినన్ని సీట్లు దక్కకపోవడంతో.. ఈ ఉపఎన్నికతో నగరంలో తన ఉనికి చాటుకోవాలని చూస్తోంది. మరోపక్క బీఆర్ఎస్ పార్టీ ఉన్న సీటును కాపాడుకోవాడానికి వ్యూహాలు రచిస్తోంది. అయితే.. తుది జాబితా విడుదల కావడంతో త్వరలోనే ఉ ప ఎన్నిక జరిగే అవకాశం ఉంది.

# జాతీయం

## ఫస్ట్ నైట్ రోజు వరుడికి గట్టి షాకిచ్చిన వధువు




మేకార్తి దినపత్రిక ఇంటర్నెట్ డెస్క్:

ఎన్నో ఆశలతో భార్యతో కొత్త జీవితం మొదలుపెట్టాలనుకున్న ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. ఫస్ట్ నైట్ రోజు భార్య ఆ వ్యక్తికి మతిపోగొట్టే ట్విస్ట్ ఇచ్చింది. డబ్బు, బంగారంతో ఇంటినుంచి పారిపోయింది. దీంతో ఆ వ్యక్తి కుదేలయ్యాడు. చేసేది ఏమీ లేక పోలీసులను ఆశ్రయించాడు. ఈ సంఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. కిషన్‌ఘర్‌కు చెందిన ఓ వ్యక్తికి చాలా కాలం నుంచి పెళ్లి కావటం లేదు. సంబంధాలు చూసి బాగా విసిగిపోయాడు. ఇలాంటి సమయంలో జితేంద్ర అనే పెళ్లిళ్ల బ్రోకర్ అతడి జీవితంలోకి వచ్చాడు.

జైపూర్‌కు చెందిన ఓ యువతి సంబంధం తీసుకువచ్చాడు. సీన్ కట్ చేస్తే ఇద్దరీ జైపూర్‌లో ఘనంగా పెళ్లి జరిగిపోయింది. సంబంధం కుదిర్చినందుకు పెళ్లికొడుకు దగ్గరినుంచి జితేంద్ర ఏకంగా 2 లక్షల రూపాయలు తీసుకున్నాడు. తాజాగా పెళ్లికూతురు, పెళ్లి కొడుకు కిషన్‌ఘర్ వచ్చారు. అత్తగారు పెళ్లి కూతురికి తమ సంప్రదాయం ప్రకారం భారీగా నగలు బహుమతి ఇచ్చింది. అదే రోజు ఫస్ట్ నైట్ కోసం ఏర్పాటు జరిగాయి. ఇందుకు పెళ్లి కూతురు ఒప్పుకోలేదు. 'మా సంప్రదాయం ప్రకారం శోభనం ఇప్పుడు జరగడానికి వీలు లేదు. నేను నీతో ఒకే గదిలో కలిసి కూడా పడుకోను' అని అంది.

ఇందుకు అతడు ఒప్పుకున్నాడు. పెళ్లి కూతురు ఒంటరిగా వేరే గదిలో పడుకుంది. తెల్లవారు జామున 3 గంటల సమయంలో వరుడు నీటి కోసం గదిలోంచి బయటకు వచ్చాడు. అప్పుడు అతడికి షాకింగ్ విషయం తెలిసింది. పెళ్లి కూతురు నగలు, డబ్బులతో ఇంటినుంచి పరారైన సంగతి తెలిసింది. ఆ ఫ్యామిలీ మొత్తం స్థానిక బస్టాండ్, రైల్వే స్టేషన్, దగ్గరలోని ఏరియాల్లో వెతికింది. పెళ్లి కూతురు ఎక్కడా కనిపించలేదు. దీంతో వరుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లి కూతురితో పాటు జితేంద్ర కూడా కనిపించటం లేదు. దీంతో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

## నా పై ప్రతీకారం తీర్చుకోండి

### అంతే కానీ




మేకార్తి దినపత్రిక చెన్నై, సెప్టెంబర్ 30:

కరూర్ తొక్కిసలాట ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని టీవీకే పార్టీ చీఫ్, హీరో విజయ్ తెలిపారు. ఈ ఘటనతో తన గుండె ముక్కలందన్నారు. ఈ ఘటనతో తనకు మాటలు సైతం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో నిజం వెలుగులోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తమిళనాడులోని కరూర్‌లో శనివారం జరిగిన తొక్కిసలాట ఘటనపై విజయ్ తొలిసారి స్పందించారు. అందుకు సంబంధించిన వీడియోను హీరో విజయ్ మంగళవారం విడుదల చేశారు. తనపై అమిత ప్రేమతో ప్రజలు ఈ సభకు తరలి వచ్చారన్నారు. బాధిత కుటుంబాలను త్వరలో పరామర్శిస్తానని ఈ సందర్భంగా విజయ్ వెల్లడించారు. ప్రజల భద్రతకే తాను ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. తనను టార్గెట్ చేయండి.. అంతేకానీ ప్రజలను మాత్రం ఇబ్బంది పెట్టొద్దంటూ తన ప్రత్యర్థులకు టీవీకే చీఫ్ విజయ్ సూచించారు.

తమ తప్పు లేకపోయినా.. తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎప్పుడూ తనకు ఎదురు కాలేదని ఆయన గుర్తు చేసుకున్నారు. కావాలనుకుంటే తనపై ప్రతీకారం తీర్చుకో వచ్చంటూ తమిళనాడు సీఎం స్టాలిన్‌కు విజయ్ సవాల్ విసిరారు. కానీ తన పార్టీ కార్యకర్తల జోలికి మాత్రం వెళ్లకండంటూ వారికి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటన కరూర్‌లోనే ఎందుకు జరిగింది? అంటూ విజయ్ సందేహం వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఎలా జరిగిందో తనకు ఇప్పటికీ అర్థం కావట్లేదన్నారు. కరూర్ ఘటన కారణాలు ఒక్కొక్కటిగా తెలుస్తున్నాయని ఈ సందర్భంగా విజయ్ పేర్కొన్నారు. అయితే తమకు అనుమతి ఇచ్చిన ప్రాంతంలోనే సభ నిర్వహించామని విజయ్ గుర్తు చేశారు.

## సుశాంత్ సింగ్ కేసు రియా చక్రవర్తికి బిగ్ రిలీఫ్

మేకార్తి దినపత్రిక బాంబే ౼

హైకోర్టులో ప్రముఖ బాలీవుడ్ నటి రియా చక్రవర్తికి భారీ ఊరట లభించింది. పాస్ పోర్ట్‌కు సంబంధించిన విషయంలో కోర్టు రియాకు సానుకూలంగా తీర్పునిచ్చింది. రియా పాస్ పోర్టును వెంటనే తిరిగి ఇచ్చేయాలని నార్కోటిక్స్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (%చీజదీ%)ని ఆదేశించింది. ఇంతకీ సంగతేంటంటే.. ప్రముఖ బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ 2020, జూన్ 14వ తేదీన తన ఫ్లాట్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సుశాంత్ మరణం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో డ్రగ్స్ కోణం వెలుగులోకి వచ్చింది.

సుశాంత్ మరణంతో సంబంధం ఉన్న డ్రగ్స్ కేసులో 2020, సెప్టెంబర్ 8వ తేదీన హీరోయిన్ రియా చక్రవర్తిని ఎన్‌సీబీ అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలోనే ఆమె పాస్ పోర్టును సీజ్ చేసింది. అయితే, 2020 అక్టోబర్ నెలలో ఆమెకు బెయిల్ వచ్చింది. కోర్టు కండీషన్ బెయిల్ మాత్రమే ఇచ్చింది. రియా పాస్ పోర్టు ఎన్‌సీబీ ఆధీనంలోనే ఉండాలని స్పష్టం చేసింది. విదేశాలకు వెళ్లాలనుకునే ప్రతీసారి ట్రైల్ కోర్టు అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. అయితే, తాజాగా, రియా చక్రవర్తి కోర్టులో పాస్ పోర్టు విషయమై పిటిషన్ వేసింది.

## పీఓకేలో రెండో రోజూ కొనసాగిన నిరసనలు



మేకార్తి దినపత్రిక ఇంటర్నెట్ డెస్క్:

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రెండో రోజూ ప్రజానిరసనలు కొనసాగాయి. పాక్ ప్రభుత్వ అణచివేత ధోరణికి వ్యతిరేకంగా జనాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వంతెనపై నుంచి జనాలు వెళ్లకుండా అడ్డంగా పెట్టిన కంటెయినర్‌లను నదిలోకి తోసి మరీ ముందుకు సాగారు. అవామీ యాక్షన్ కమిటీ (ఏసీసీ) సారథ్యంలో ఈ నిరసనలు మొదలైన విషయం తెలిసిందే. పాక్ పాలకుల వైఖరి కారణంగా తమకు ప్రాథమిక హక్కులు కూడా దక్కట్లేదని ఏసీసీ ప్రతినిధులు, జనాలు మండిపడుతున్నారు. తొలి రోజు ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. పోలీసు కాల్పుల్లో ఇద్దరు మరణించగా డజనుకు పైగా జనాలు గాయపడ్డారు. ఇష్టారీతిన వ్యవహరిస్తే ఊరుకునేది లేదని పాక్ ఆర్మీ, పోలీసులు గట్టి హెచ్చరికలు చేశారు వీటిని లెక్క చేయకుండా స్థానికులు రెండో రోజు కూడా నిరసనలకు దిగారు. స్థానికంగా ఉన్న మార్కెట్‌లు, షాపులు, ఇతర వ్యాపారాలను మూసేశారు. రవాణా సౌకర్యాలు కూడా స్తంభించిపోవడంతో జన జీవితం అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం ముందు నిరసనకారులు మొత్తం 38 డిమాండ్‌లను పెట్టారు. కశ్మీర్ నుంచి వలసొచ్చిన వారికి పీఓకే అసెంబ్లీ సీట్లలో కొన్ని కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి కోటా ప్రజాప్రాతినిధ్య వ్యవస్థకు విఘాతమని అన్నారు 'మా నిరసనలు ప్రాథమిక హక్కులను సాధించుకునేందుకే. 70 ఏళ్లుగా మేము వీటి కోసం పోరాడుతున్నాము. మాకు స్వేచ్ఛ ఇవ్వకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు' అని పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్, ఇతర కీలక నేతలను ఏసీసీ నేత షౌకత్ నవాజ్ మీర్ హెచ్చరించారు.

మరోవైపు.. నిరసనలను అణచివేసేందుకు పాక్ ప్రభుత్వం బలప్రయోగానికి దిగింది. ఇప్పటికే అక్కడ సాయుధ దళాలను మోహరించిన ప్రభుత్వం.. తాజా మరో 100 మందితో కూడిన దళాలను పంపించింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. ఈ నిరసనల హోరు విదేశాలకు కూడా పాకింది. కశ్మీరీ సంతతి వారు బ్రిటన్‌లోని పాక్ రాయబార కార్యాలయాలు ఎదుట నిరసనకు తెర తీశారు.

## వివాదం రేపిన పీఎం సలహాదారు వ్యాఖ్యలు



మేకార్తి దినపత్రిక న్యూఢిల్లీ:

న్యాయవ్యవస్థ పై ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ కలల సాకారానికి న్యాయవ్యవస్థ 'ఒక పెద్ద అవరోధం'గా ఉందని సన్యాల్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై సుప్రీంకోర్ట్ బార్ అసోసియేష అధ్యక్షుడు, సీనియర్ అడ్వకేట్ వికాస్ సింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

అసోసియేషన్ ఆఫ్ ఇండియాస్ న్యాయ నిర్మాణ్ 2025 జనరల్ కౌన్సిల్ సమావేశంలో సన్యాల్ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాలకు సుదీర్ఘ సెలవులపై విమర్శలు గుప్పించారు. దేశ లీగల్ ఫౌండేషన్ భవిష్యత్తుపై చర్చించేందుకు ఏర్పాటయిన ఈ ఫోరంలో పలువురు మంత్రులు, న్యాయమూర్తులు, పారిశ్రామిక వేత్తలు ఉన్నారు. న్యాయ పరిభాషలో వాడుతున్న 'ప్రేయర్', 'మి లార్డ్' అనే పదాలపై కూడా సన్యాల్ విమర్శించారు. ఇదొక వారసత్వంగా, ఎన్నో ఏళ్ల క్రితం నాటి హ్యాబిట్‌గా మారిందన్నారు.

బాధ్యత లేని వ్యాఖ్యలు కాగా, న్యాయవ్యవస్థపై సన్యాల్ చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం బాధ్యాతాయుతంగా లేవని, ఆయన 'బ్యాడ్ టేస్ట్'కు అద్దం పడుతున్నాయని వికాస్ సింగ్ అన్నారు. ఉన్నత కోర్టుల సెలవులపై ఎవరు మాట్లాడినా వారికి ఉన్నత న్యాయ స్థానాల పనితీరుపై ఏమాత్రం అవగాహన లేకపోవడమే కారణమని అన్నారు. హైయర్ కోర్టులలో వెకేషన్ల ఉద్దేశం అర్థం చేసుకోవాలంటే ఒక బిజీ లాయర్ లేదా జడ్జి సాధారణ సమయాల్లో ఏం చేస్తారో తెలుసుకుంటే అవగతమవుతుందని అన్నారు. న్యాయవ్యవస్థ పనితీరుపై ఎవరైనా మాట్లాడితే అది అసహనంతో చేస్తున్న వ్యాఖ్యలుగానే భావించాల్సి ఉంటుందని చెప్పారు. ఉన్నత న్యాయస్థానాలకు సెలవులపై సన్యాల్ మాట్లాడటం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది కూడా ఆయన ఇదే తరహాలో వ్యాఖ్యలు చేశారు న్యాయ వ్యవస్థలో సుదీర్ఘ సెలవులపై తక్షణ సంస్కరణలకు ఆయన పిలుపునిచ్చారు. మాజీ సీజేఐ చంద్రచూడ్ తన హయాంలో వెకేషన్ల పేరును పాక్షిక పని దినాలుగా మార్చారు.

## బిహార్ ఓటర్ల తుది జాబితా విడుదల చేసిన ఈసీ




మేకార్తి దినపత్రికపాట్నా:

బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను చేపట్టిన ఎన్నికల కమిషన్ (మంగళవారంనాడు మధ్యాహ్నం 3.00 గంటలకు ఓటర్ల తుది జాబితాను ంచిన ఓటర్ల జాతాను ఈసీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

బిహార్‌లో 22 ఏళ్ల తర్వాత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను ఈసీ చేపట్టడం విశేషం. ఓటర్ల తుది జాబితా ఆధారంగానే అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించనుంది. తుది జాబితా కాపీలను అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు పంపిస్తామని బీహార్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) తెలిపారు. వీరితో పాటు గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు కూడా ఈ జాబితాను షేర్ చేస్తామని చెప్పారు.

ఎస్ఐఆర్ వివాదం

బీహార్‌లో ఈసీ ఇటీవల చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చుట్టూ వివాదం తలెత్తింది. బీజేపీకి అనుకూలంగా ఓటర్ల జాబితాను ఎలక్షన్ కమిషన్ టాంపరింగ్ చేస్తోందని విపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. ఈ ప్రక్రియను నిలిపివేయాల్సిందిగా కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే ఆ విజ్ఞప్తులను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చుతూ, తుది జాబితా ప్రచురించిన తర్వాత ఏవైనా అవకతవకలు జరిగినట్టు తేలితే మొత్తం ప్రక్రియనే ఆపేస్తామనిహెచ్చరించింది. దీనిపై తదుపరి విచారణను అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది.

బిహార్‌లో ఈసీ టీమ్ పర్యటన

కాగా, అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతను సమీక్షించేందుకు ఎన్నికల కమిషన్ టీమ్ ఈనెల 4,5 తేదీల్లో బిహార్‌లో పర్యటించనుంది. వచ్చే వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. ఛాత్ పండుగ పూర్తయిన తర్వాత అక్టోబర్‌లో తొలి విడత ఎన్నిక జరగవచ్చని అంచనా వేస్తున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఉప ఎన్నికలను పర్యవేక్షించేందుకు 470 మంది పరిశీలకులను ఈసీ ఇప్పటికే నియమించింది. 243 మంది సభ్యుల ప్రస్తుత బిహార్ అసెంబ్లీ గడువు నవంబర్ 22వ తేదీతో ముగియనుంది.

# అంతర్జాతీయం

## దాడుల తర్వాత పాక్‌తో యుద్ధం వద్దని చెప్పిన అమెరికా



మేకార్తి దినపత్రిక న్యూఢిల్లీ:

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 26/11 ముంబై ఉగ్రదాడులపై కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కీలక సమాచారాన్ని వెల్లడించారు. ముంబై దాడుల అనంతరం తాను కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు తీసుకోవడం నుంచి పాక్‌పై ప్రతిదాడికి అడ్డుపడిన పరిస్థితులను ఆయన ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ముంబై ఉగ్రదాడుల అనంతరం పాకిస్థాన్‌పై సైనిక చర్యకు ఆలోచించినప్పటికీ అంతర్జాతీయ ఒత్తిడులు, ముఖ్యంగా అమెరికా నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగా ఆ నిర్ణయం నిలిచిపోయిందని చెప్పారు. అప్పట్లో పాకిస్థాన్‌పై దాడి చేయాలని తన మనసులో ఉందని, అయితే సైనిక చర్యకు దిగరాదని యూపీఏ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

యుద్ధం వద్దన్న అంతర్జాతీయ సమాజం

ముంబై ఉగ్రదాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోయిన కొద్ది రోజులకే కేంద్ర హోం మంత్రిగా పి.చిదంబరం బాధ్యతలు చేపట్టారు. అప్పుడు ప్రపంచం అంతా యుద్ధం ప్రారంభించవద్దని చెప్పడానికి ఢిల్లీకి వస్తోందని, నాటి అమెరికా విదేశాంగ కార్యదర్శి కండోలిజా రైస్ ప్రత్యేకంగా తనను, ప్రధానిని కలిసేందుకు ఢిల్లీకి వచ్చారని చెప్పారు. యుద్ధంపై ముందుకు వెళ్లొద్దని తమను కోరారని వెల్లడించారు. పాకిస్థాన్‌కు బదులు చెప్పాలని తన మనసులో ఉందని, దీనిపై ప్రధానమంత్రి, ఇతర ముఖ్య వ్యక్తులతో చర్చించానని చెప్పారు. అయితే భౌతికంగా కాకుండా దౌత్యమార్గాలను ఉపయోగించాలని చివరికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

బీజేపీ స్పందన

చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందించారు. ముంబై దాడుల అనంతరం హోం మంత్రి భాధ్యతలు తీసుకునేందుకు తొలుత చిదంబరం నిరాకరించారని, పాకిస్థాన్‌పై మిలటరీ చర్యను ఆయన కోరుకున్నప్పటికీ ఆయనపై ఇతరులు విజయం సాధించారని అన్నారు. పాక్‌పై ప్రతీకార చర్యలను కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ అడ్డుకున్నారా, ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అడ్డుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వంపై కండోలిజా రైస్ ప్రభావం ఉన్నట్టు కనిపిస్తోందన్నారు.

2008 నవంబర్ 8న ఏంజరిగిందంటే..

2008 నవంబర్ 8న ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు చెందిన 10 మంది పాక్ ఉగ్రవాదులు ముంబైలోని పలు కీలక ప్రాంతాల్లో ఏకకాలంగా దాడులకు దిగారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ రైల్వే స్టేషన్, ఒబెరాయ్ ట్రిడెంట్, తాజ్ మహల్ ప్యాలెస్ అండ్ టవర్ హోటల్, కామా ఆసుపత్రి, నారిమన్ హౌస్‌లపై విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోగా, 308 మంది గాయపడ్డారు. లష్కరే ఉగ్రవాది అజ్మల్ కసబ్ ఒక్కరే ముంబై పోలీసులకు పట్టుబడగా, 2012లో అతన్ని ఉరితీశారు.

## వీసా గురించి కీలక అప్డేట్

### వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి కొత్త రూల్స్




మేకార్తి దినపత్రిక ఇంటర్నెట్ డెస్క్:

అమెరికాలో ఉద్యోగాల కోసం చూసే వారికవీసా ఒక కీలకమైన మార్గం. ఈ వీసా ద్వారా ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం కలిగిన కార్మికులు, భారతీయ నిపుణులు, అమెరికాలో తమ కెరీర్‌ను నిర్మించుకునే అవకాశం పొందుతారు. ఈ వీసా విధానంలో ఫిబ్రవరి 2026 నుంచి గణనీయమైన మార్పులు రాబోతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ ప్రకటించారు. ఈ మార్పులు భారతీయ నిపుణులతో సహా వీసా కోసం చూస్తున్న వారిపై ప్రభావం చూపనున్నాయి.

వీసా అంటే ఏంటి?

వీసా 1990లో అమెరికా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక ప్రత్యేక వీసా విధానం. ఇది నైపుణ్యం కలిగిన విదేశీ కార్మికులను అమెరికాలోని కంపెనీలు నియమించుకునేందుకు అనుమతిస్తుంది. సాంకేతిక, ఇంజనీరింగ్, ఇతర ప్రత్యేక రంగాల్లో నిపుణులైన వారికి ఈ వీసా ద్వారా అమెరికాలో పనిచేసే అవకాశం లభిస్తుంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఈ వీసా కోసం దరఖాస్తు చేస్తారు. భారతీయ నిపుణులు కూడా ఈ వీసా ద్వారా అమెరికాలో ఉద్యోగాలు పొందుతారు.

కొత్త నిబంధనలు

వీసా విధానంలో లోపాలను సరిచేసి ఫిబ్రవరి 2026 నుంచి కొత్త సంస్కరణలను అమలు చేయనున్నట్లు అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ తెలిపారు. ప్రస్తుతం %ఎ-1దీ% వీసాల కేటాయింపు లాటరీ పద్ధతి ద్వారా జరుగుతోంది. ఈ వ్యవస్థను రద్దు చేసి, నైపుణ్యం ఆధారంగా వీసాలను కేటాయించే అవకాశం ఉందని లుట్నిక్ అన్నారు. ఈ మార్పు ద్వారా నైపుణ్యం కలిగిన వారికి మాత్రమే అవకాశాలు లభించేలా చేస్తామన్నారు.

లుట్నిక్ ప్రకారం

ట్రంప్ ఇటీవల వీసా రుసుమును 100,000కు పెంచారు. ఈ భారీ రుసుము పెంపు కంపెనీలపై ఆర్థిక భారాన్ని పెంచుతుంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరగతి కంపెనీలపై ప్రభావం చూపించనుంది. లుట్నిక్ ప్రకారం వీసా ద్వారా చౌకైన సాంకేతిక సలహాదారులను లేదా ఇంటర్న్‌లను నియమించుకోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులను మాత్రమే ఆహ్వానించాలని చూస్తోందని, వారి కుటుంబాలను తీసుకురావడానికి అనుమతించడం సరికాదని ఆయన అన్నారు.

భారతీయ నిపుణులపై ప్రభావం

వీసా విధానంలో ఈ మార్పులు భారతీయ నిపుణులపై ప్రభావం చూపనున్నాయి. భారతదేశం నుంచి ప్రతి సంవత్సరం లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఐటీ నిపుణులు, ఇతర రంగాల నిపుణులు %ఎ-1దీ% వీసా ద్వారా అమెరికాలో ఉద్యోగ అవకాశాలను పొందుతున్నారు. ఈ కొత్త నిబంధనలు వీసా దరఖాస్తు ప్రక్రియను మరింత కఠినతరం చేయనున్నాయి. రుసుము పెంపు వల్ల కంపెనీలు తక్కువ దరఖాస్తులను సమర్పించే అవకాశం ఉంది.

దీంతోపాటు లాటరీ వ్యవస్థ రద్దు కావడం వల్ల నైపుణ్యం ఆధారిత ఎంపిక ప్రక్రియ అమలులోకి వస్తే, అత్యంత అర్హత కలిగిన వారికి మాత్రమే అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఇది భారతీయ నిపుణులకు పోటీని మరింత తీవ్రతరం చేయనుంది

## సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం

ఇంటర్నెట్ డెస్క్:

ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం సంభవించింది. రెక్టర్ స్కేలుపై 6.9 తీవ్రత కలిగిన భూకంపం కారణంగా సెంట్రల్ ఫిలిప్పీన్స్ ప్రాంతంలో భారీ ప్రకంపనలు సంభవించాయి. భూకంప తీవ్రతను తొలుత 7.0గా ప్రకటించిన యూఎస్ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆ తరువాత కొద్దిగా తగ్గించింది. పలోంపాన్‌కు పశ్చిమాన సుమారు 10 కిలోమీటర్ల దూరంలో సముద్రం గర్భంలో భూకంప కేంద్రం ఉన్నట్టు తెలిపింది. అయితే, భూకంపం కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదుఅకస్మాత్తుగా భూమి కంపించడంతో తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. ఇళ్లల్లోంచి బయటకు వచ్చి పరుగులు తీశారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. అయితే, భూకంప తీవ్రత కారణంగా సముద్రమట్టంలో స్వల్ప మార్పులు ఉంటాయని స్థానిక వాతావరణ శాఖ తెలిపింది. అయితే, సునామీ ముప్పు కూడా లేదని పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ హెచ్చరించింది. తీర ప్రాంతాల్లోని వారు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించింది.

## అధికారం కోసం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినవాళ్లను తరిమికొట్టండి



మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ప్రతినిధి

పదేండ్ల పాటు కష్టపడిన అసలు సిసలు కాంగ్రెస్ కార్యకర్తలను గోసపెడుతున్న వారిని తరిమికొట్టాలి

తినే టైంలోమరొకడు వస్తే ఊకుంటమా అభివృద్ధి పేరిట కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే తీరుతోపాటు, కాంగ్రెస్ పార్టీ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన జీవన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నంత మాత్రాన అభివృద్ధి జరగదు, చేయరాదు అనేది తప్పు మాట2014లో సీఎం హెూదాలో కేసీఆర్ కరీంనగర్లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తే, జగిత్యాల అభివృద్ధి నేపథ్యంలో బోర్నపెల్లి-చిన్నబెల్లాల వంతెన మంజూరు చేయాలని కోరానని, వెంటనే స్పందించిన కేసీఆర్ కేవలం ఐదు నిమిషాల వ్యవధిలో రూ.70 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

## ఎన్ ఎస్ ఎస్ఆధ్వర్యంలో మూడనమ్మకాలపై అవగాహన ర్యాలీ




మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ 30
చేర్యాల ప్రతినిధి కర్రోల్ల నవజీవన్.

చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 7 రోజులు ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.మధు ఆధ్వర్యంలో మూడనమ్మకాలు నిరక్షరాస్యత,సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ మొదలగు విషయాలపై గ్రామంలో విద్యార్థిని, విద్యార్థులతో అవగాహన ర్యాలీ ఏర్పాటు చెయ్యడం జరిగింది. సాధారణంగా గ్రామంలో భయం, అజ్ఞానం,అతి విశ్వాసాలను ఆసరాగా చేసుకొని మూడమమ్మకాలపై ఆధారపడుతుంటారు, వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదని వాటికి వీలైనంత దూరంలో ఉండవలెననీ గ్రామస్థులకు నచ్చజెప్పడం జరిగిందిఉదాహరణకు కొన్ని మూఢనమ్మకాల వల్ల పిల్లి ఎదురవడం,రాత్రి వేళ్ల గోళ్ళు తీసుకోవడం ,సూర్యాస్తమయం తర్వాత ఊడవడం,రాత్రి పూట విజిల్ వేయడం ,కన్ను ఆదరడం మొదలవ్వునవి వాటిమీద అవగాహన కల్పించడం జరిగింది.

## ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు ప్రకారం

### ఎంపీటీసీ, జెడ్పిటిసి సర్పంచులకు రిజర్వేషన్లు అమలు చేయాలి

**రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్**




మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ కరీంనగర్

ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు ప్రకారమే జడ్పిటిసి. ఎంపిటిసి. సర్పంచుల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని 10 శాతం ఎస్టీలకు రిజర్వేషను అమలు చేస్తే చాల మంది ఎస్టీలు రాజకీయంగా ఎదుగుతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్టీలకు 10% రిజర్వేషనను అమలు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజనులు రాజకీయంగా.ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని. ఒక్కరు మంత్రులు ఉన్న గిరిజనులను పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం 10% ఎస్టిలకు రిజర్వేషన్ అమలు చేయాలని ప్రకటనలో డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎస్టీలు జనరల్ మరియు ఎస్టీ రిజర్వేషన్లు పోటీ చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ద్వారా పిలుపునిచ్చారు. ఆర్.పి.ఐ పార్టీ ఎప్పటికీ మద్దతు ఉంటుందని ఎస్టీలకు పిలుపునిచ్చారు.

## గ్రూప్ 2, 3లో సత్తాచాటిన మహిళా కానిస్టేబుల్




మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ 30
చేర్యాల ప్రతినిధి కర్రోళ్ల నవజీవన్

కరీంనగర్ మహిళా కానిస్టేబుల్ శైలుకిరణ్ తాజా గ్రూప్స్ ఫలితాల్లో డిప్యూటీ ఎంఆర్ఎ (గ్రూప్ 2) మరియు సీనియర్ అసిస్టెంట్ (గ్రూప్ 3) పోస్టులకు ఎంపికయ్యారు. ప్రిపరేషన్ సమయంలో తండ్రి మరణించినా, పట్టుదలతో చదువు కొనసాగించి విజయం సాధించారు. ఆమె విజయం పట్ల కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

**టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ.**



మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ కరీంనగర్

సర్వీస్ లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులను టెట్ నుంచి కేంద్రం ప్రభుత్వం చొరవ తీసుకొని మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఈసందర్భంగా ఖాద్రీ మాట్లాడుతూ ఇటీవల సుప్రీం కోర్టు ద్వారా సర్వీస్‌లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు టెట్ పాస్ ఐ ఉండాలనే నిబంధనను సుప్రీం పునరాలోచన చేయాలని , ఉపాధ్యాయులిపుడు పుస్తకాలతో కుస్తీలు పట్టడం కష్టం అవుతుందన్నారు, టెట్ ఎపుడైతే అమలైందో దానికంటే ముందు సర్వీస్ లో వచ్చిన వారందరికీ మినహాయించాలని అన్నారు. ఒకవేళ నిబంధనను ఖచ్చితంగా పాటించాలంటే రాష్ట్ర విద్యాశాఖ ద్వారా ఒక స్పేసియల్ టెట్ పేపర్ సునాయాసంగా పద్ధతి ప్రకారం నిర్వహించినా ఉపాధ్యాయులకు కొంత వరకు ఉపసమనం లభిస్తుందన్నారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు టెట్ అనే అంశంపై గందరగోళం పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నా నేపథ్యంలో ప్రభుత్వం ఒక నిర్ణయాత్మక సూచనలు ఇవ్వాలని కోరారు.

## నిష్పక్షపాతంగా ఎన్నికలు విధులు నిర్వర్తించాలి





మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు నిస్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హరిత ఆదేశించారు.

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్( ఎంసీసీ)పై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ హరిత హాజరై మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు. విధుల్లో భాగంగా ఎఫ్ఎస్, ఎస్ఎస్టీ లు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు.

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడంపై వివరించారు. ఆయా మండలాల నోడల్ ఆఫీసర్లు తమ నివేదికను ప్రతి రోజు పంపించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంసీసీ నోడల్ ఆఫీసర్ గా డీఆర్డీఓ శేషాద్రి నియమించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఉంటాయని తెలిపారు.సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, డీపీఓ షర్ఫుద్దీన్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## అన్నదానానికి మించిన దానం మరొకటి లేదు



మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ 30
చేర్యాల ప్రతినిధి కర్రోల్ల నవజీవన్.

అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ పూజారి శెట్టే యాదగిరి అన్నారు. శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రాంపూర్ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం వద్ద ప్రతిష్టించిన దుర్గ మాత అమ్మవారికి మంగళవారం ప్రత్యేక అలంకరణ చేపట్టి పంచామృతాభిషేకం, మహామంగళహారతి తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ పూజారి శెట్టే యాదగిరి ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మేరకు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా అన్నదానం చేయగా పెద్ద ఎత్తున స్వీకరించారు. ఈ సందర్భంగా పూజారి యాదగిరి మాట్లాడుతూ. సేవ, దానాలు చేసే ప్రతి ఒక్కరు ఆలయాలలోనే కాకుండా ఆకలితో అలమటిస్తున్న వారికి కడుపునిండా అన్నం పెట్టి నిరుపేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తిని ఇస్తుందని అలానే గొప్ప విషయం అన్నారు. అలానే ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో బాగుండాలని దుర్గామాత అమ్మవారిని వేడుకున్నట్లు యాదగిరి తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి 50కేజీ ల బియ్యని అందజేసిన బొప్పనపల్లి బాలేష్ ను అభినందించారు.

## జనగామలో బతుకమ్మ వేడుకలు



మేకార్తీ దినపత్రిక సెప్టెంబర్ 30
జనగామ ప్రతినిధి కర్రోల్ల నవజీవన్.

జనగామలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సతీమణి పల్లా నీలిమ జనగామలోని బతుకమ్మ కుంటలో స్థానిక అక్కచెల్లెమ్మలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఆమెతో పాటు మహిళలు ఉత్సాహంగా బతుకమ్మలు ఆడుతూ, సాంప్రదాయ గీతాలతో కార్యక్రమాన్ని మరింత సందడిగా మార్చారు.

## రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తున్నారా



మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ప్రతినిధి

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో నిన్నటి నుంచి పోలీసులు, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు ప్రారంభించారు.

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఒక వ్యక్తి రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తే సరైన పత్రాలు చూపించాలి.

లేదంటే నగదును సీజ్ చేస్తారు.

తనిఖీల సమయంలో డాక్యుమెంట్స్ చూపలేకపోతే తర్వాత సమర్పించినా డబ్బును తిరిగిస్తారు.

రూల్స్ పాటించాలని అధికారులు సూచిస్తున్నారు...

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Pri- ted at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com